**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ వారి కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేదీ : 09.11.2017.**

# జేబు దొంగతనాలకు పాల్పడే ఇద్దరు పాత నేరస్థులు అరెస్ట్

## *ఆరు కేసుల్లో రూ.1.46 లక్షల నగదు స్వాధీనం*

ప్రయాణీకులు ఏమరుపాటుగా ఉన్న సమయాన్ని ఆసరాగా తీసుకుని రద్దీ ప్రదేశాలు, సిటీ బస్సుల్లో మరియు బస్‌స్టాండ్‌లో జేబు దొంగతనాలకు పాల్పడే ఇద్దరు పాత నేరస్థులను ది.09.11.17న సిసిఎస్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.1.46 లక్షల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

గవర్నరుపేట ఎన్‌టిఆర్ కాంప్లెక్స్ వద్ద జేబు దొంగతనాలు చేయడానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులను గమనించిన సిసిఎస్ పోలీసులు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని విచారించడంతో ఇద్దరు కలసి చేసిన జేబు దొంగతనాల గురించి వెల్లడయ్యాయి.

విజయవాడ కొత్త రాజరాజేశ్వరిపేటకు చెందిన మేడా రామారావు (24) మరియు ఊర్మిళానగర్‌కు చెందిన చిన్నపోతుల కిరణ్‌కుమార్ (28) ఇద్దరు స్నేహితులు. నిందితుల్లో మేడా రామారావు పాత నేరస్థుడు కాగా గతంలో కృష్ణాజిల్లా, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు జేబు దొంగతనం కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లడం జరిగింది. జైలు నుండి బయటకు వచ్చిన తరువాత చిన్నపోతుల కిరణ్‌కుమార్‌ను కలుపుకుని తిరిగి జేబుదొంగతనాలు ప్రారంభించాడు.

ఈ క్రమంలో ఇద్దరు కలసి ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 నేరం, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 నేరం, అజిత్ సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 నేరం, సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 నేరం మరియు కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 నేరాలు మొత్తం 6 నేరాలకు పాల్పడ్డారు.

రద్దీ ప్రదేశాలు, సిటీ బస్సుల్లో మరియు బస్‌స్టాండ్‌లను దొంగతనాలు చేయడానికి అనువుగా ఎంచుకున్న ఇద్దరు నిందితులు తోటి వ్యక్తులు ఏమరుపాటుగా ఉన్న సమయంతో వారి జేబుల్లో ఉండే నగదు పర్సులను లాఘవంగా దొంగిలించి వెంటనే అక్కడి నుండి ఉడాయిస్తారు.

నగర పోలీస్ కమీషనర్ గారి ఆదేశాలపై విజయవాడ నగరంలో వివిధ నేరాల నియంత్రణ మరియు నేరస్థుల కథలికలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసిన సిసిఎస్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.1.46 లక్షల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

-- xx --